శ్రీహరి, గిరీశం, నేనూ ఇంటర్ నుంచి కలిసి చదువుకున్నాం. తార్నాకలో ఒకే గదిలో ముగ్గురమూ కలిసి వుంటూ వుండేవాళ్ళం. కలిసే భోంచేసేవాళ్లం. ఒకే కంచంలో తింటూ, ఒకే మంచంలో పడుకోక పోయినా దాదాపు అలానే వుండేవాళ్లం. సినిమాలకెళ్లినా మరెక్కడికెళ్లినా కలిసే వెళ్లేవాళ్లం. ఇలా అంటుకుని తిరగడంవల్లనే మా యితర ఫ్రెండ్స్ మాకు 'ఎంటమీబా స్పీషిస్' అన్న నిక్‌నేమ్ కూడా పెట్టారు (అంటే ఏమిటో నాకు తెలీదు. నేను సైన్సు చదవలేదు). తరువాత గిరి మెడిసిన్‌లో చేరాడు. గ్రాడ్యుయేషన్ అయ్యాక ఇంగ్లీష్ లిటరేచర్ తీసుకుని యూనివర్సిటీలో చేరాను నేను. హరి కూడా ఎమ్.ఎ. స్టాటిస్టిక్స్ తీసుకుని యూనివర్సిటీలోనే చేరాడు. మేం పోస్ట్ గ్రాడ్యుయేషన్ అయిందని పించాం. గిరి మెడిసిన్ పూర్తిచేసి హౌస్ సర్జనింగ్ మొదలెట్టాడు. మా యిద్దరికీ ఉద్యోగాలు హైదరాబాదులోనే వచ్చాయి.

ఇన్ని మార్పులు వచ్చినా ముగ్గురం బ్రహ్మచారులం అదే రూంలో జీవితాన్ని కొనసాగిస్తూ వచ్చాం. మమ్మల్ని విడదీసేది 'పెళ్లి' ఒక్కటే అనుకునేవాళ్లం. మాలో ముందుగా ఎవడు పెళ్లి చేసుకుంటాడో, ఎవడు ముందుగా విడిపోతాడో అనుకుంటూ వుండేవాళ్లం.

తరచు 'పెళ్లి' గురించి చర్చ తలయెత్తేది మా ముగ్గురి మధ్య. గిరి ఈ విషయంలో 'పెసిమిస్టిక్' ధోరణిలో మాట్లాడేవాడు. అతనో 'మిసోజినిస్ట్', 'మిసోగమిస్ట్' కూడా (స్త్రీ ద్వేషి సంసార ద్వేషి). ''పెళ్లెందుకురా, హాయిగా బాదరబందీలు లేకుండా జల్సాగా, స్వేచ్ఛగా జీవించెయ్యాలి!'' అంటుండేవాడు.

నేను గిరితో కొంతవరకు ఏకీభవించినా నా అభిప్రాయాలు కొంచెం విరుద్ధంగా వుండేవి. ''నువ్వు చెప్పేది నిజమేననుకో. కానీ స్వేచ్ఛ, ఒంటరితనమూ కొన్నాళ్లకి మొహం మొత్తి మెడకో గుదిబండ తగిలించుకుందాం అని పిస్తుంది. స్వాతంత్ర్యాన్ని కొంతవరకు తగలేసి బంధనాల్లో యిరుక్కోవాల్సి వస్తుంది. పెళ్లి అన్నది తప్పనిసరిగా చెయ్యవలసిన తెలివితక్కువ పని'' (సారీ! ఇంగ్లీష్ సామెతకి తెలుగు అనువాదం యింతకంటె చక్కగా కుదిరి చావటం లేదు) అన్న ధోరణిలో మాట్లాడేవాడ్ని.

హరి మా యిద్దరి వాదనల్ని తీవ్రంగా ఖండించేవాడు.

''మీ యిద్దరి అభిప్రాయాలు తప్పు. భర్త చేతుల్లో అస్తమానమూ దెబ్బలు తింటూ, బానిసల్లా చూడబడే భార్యలున్నారు. భార్యల చేతుల్లో కార్టూన్లలోలా అప్పడాల కర్రల దెబ్బలు తింటూ కుక్కిన పేనుల్లా పడి వుండే భర్తలూ వున్నారు. రెండు సందర్భాల్లోను తప్పు మగ

మినీకథ

# పండంటి సంసారానికి ఫార్ములా

వాడిదే''.

''అదెలా?'' అంటూ నేనూ, గిరీ సందేహం వెలిబుచ్చేవాళ్లం.

హరి చిన్న లెక్చరిచ్చేవాడు, జీవితాన్ని కాచి వడబోసిన పెద్ద ఫిలాసఫర్‌లా.

''భార్యని పోషించేవాడు భర్త. భార్యని ఎంత వరకు చెప్పుచేతల్లో వుంచాలన్నది భర్త చేతుల్లోనే వుంది. ఎప్పటికీ గుర్తుంచుకోండి స్త్రీకి పూర్తి స్వాతంత్ర్యం ఎప్పటికీ ఇవ్వకూడదు. అది చాలా పెద్ద పొరబాటు. పూర్తి స్వేచ్ఛనిస్తే ఆడవాళ్లు మొగుళ్లని తోలుబొమ్మలుగా ఆడిస్తారు. తల్లిదండ్రుల నుంచి, తోబుట్టువుల నుంచి విడదీస్తారు. సిగరెట్ తాగడానిక్కూడా పర్మిషన్ తీసుకోవాలంటారు. అలాగని వాళ్లకి స్వేచ్ఛ నివ్వకపోవడమూ తప్పే. అది సంస్కారవంతుల లక్షణం కాదు. వాళ్లకీ ఓ వ్యక్తిత్వం వుందని ఘోషిస్తుంటారు కనుక దాన్ని గౌరవించాలి. కాబట్టి భర్త భార్యకి కొంచెం స్వేచ్ఛనివ్వాలి. కేవలం 'ముప్పై శాతం' స్వేచ్ఛ అన్నమాట. 'డెబ్బై శాతం' కంట్రోలు వుంచాలి. అప్పుడే ఆ కాపురం సవ్యంగా నడుస్తుంది''.

నేనూ, గిరీ, హరి చేసే హితోపదేశం — అంటే 70:30 ఫార్ములాని అర్థం చేసుకోడానికి తికమకపడుతూ ప్రయత్నించేవాళ్లం, బుద్ధిమంతులైన విద్యార్థుల్లా.

మరో ఏడాదిలో హరి పెళ్లయిపోయింది. నేనూ, గిరీ పెళ్లికి వెళ్ళాం. మరో రెండు నెలలలో హరి రూం నుండి విముక్తుడయి వేరే యిల్లు తీసుకుని కాపురం పెట్టాడు. మేమిద్దరం బ్రహ్మచారులం రూంలో మిగిలిపోయాం. ఓ ఆదివారం మా యిద్దర్నీ భోజనానికి పిలిచాడు.

''ఎందుకురా ఈ ఫార్మాలిటీస్. కొత్త కదా. అప్పుడే నీ మిసెస్‌ని ఇబ్బంది పెట్టడం ఎందుకులే, కొంచెం సెటిలయ్యాక వస్తాం'' అన్నాడు గిరి.

అబ్బే అదేం కుదరదు, రావాల్సిందే అంటూ పట్టుపట్టాడు హరి.

మిసెస్ హరి మొదట కొంచెం 'యిది'గా ఫీలయినా తరువాత 'ఫ్రీ'గా మాట్లాడసాగింది. నల్గురమూ భోజనానిక్కూర్చున్నాం. చివరిగా పెరుగన్నంతో మామిడి పళ్ల ముక్కలు నంజుకుని తింటూ భోజనం అయ్యిందనిపించాం. మిసెస్ హరి చాలా 'కలుపుగోలుతనంగా వుండే మనిషి' అనుకున్నాం. భోజనం చేస్తున్నంత సేపూ ఆవిడ 'నాన్‌స్టాప్'గా గలగలా మాట్లాడుతూనే వుంది. ''ఈ సిటీలో పనిమనుషులకు ఇంత ప్రాబ్లం వుంటుందనుకోలేదండీ. ఎవరూ సరిగా చెయ్యటం లేదు. ఒక్క నెలలోనే యిద్దర్ని మాన్పించేశాను'' అంది. ''అబ్బ. ఇక ఈ అంట్లగిన్నెలన్నీ నేనే కడుక్కోవాలి బాబోయ్!''

అని కూడా అంది.

భోంచేసి 'బ్రేవ్'మని త్రేన్చుతూ, హరి లేవబోతుంటే 'ఏయ్, అలా లేచిపోతారేం. మీ ఎంగిలి కంచం ఎత్తి తీసుకెళ్లండి. ఈ ఎంగిలి మామిడి తొక్కలూ, టెంకా ఎవరు శుభ్రం చేస్తారనుకున్నారు? ఈ మధ్య మరీ సోమరితనం ఎక్కువైపోతోంది మీకు!'' అంది.




రవికృష్ణ

నేనూ, గిరీ బిక్క మొహాలు వేసుకుని ఒకర్నొకరు చూసుకున్నాం. మా యింట్లోనైతే, మా అమ్మకానీ, చెల్లెలుకానీ ఎంగిలికంచం ఎత్తే వాళ్ళు, మగవాళ్లచేత కంచం ఎత్తనివ్వరు. నేనూ, గిరీ మా కంచాల్ని ఎత్తబోతుంటే, ''మరేం ఫర్లేదు. మీరలాగే వదిలెయ్యండి'' అంది.

''హమ్మయ్య'' అనుకుని లేచాం. హరి మాత్రం ''హి..హి..హి..'' అని యికిలిస్తూ అందరి ఎంగిలి కంచాలు తీసి సింక్‌లో పడ వేశాడు. టెంకలూ, తొక్కలూ కూడా శుభ్రంగా తీసిపారేశాడు.

నేనూ, గిరీ డ్రాయింగ్ రూంలో కూర్చున్నాం, వక్కపొడి నములుతూ, టి.వి. ఆన్ చేశాం.

కాసేపటికి టవల్తో చెయ్యి తుడుచుకుంటూ, హరి కూడా వచ్చాడు, ''హి..హి.. హి..'' అంటూ.

మిసెస్ హరి యింకా వంటగదిలోనే వున్నట్లుంది. వంట గదిలోంచి ధమ ధమా వంట గిన్నెల చప్పుడు వినవస్తున్నది. నేను మెల్లగా అన్నాను. ''ఏమిట్రా హరీ, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి తెగ లెక్చర్లిచ్చేవాడివి కదా, నీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల అదే 70% 30% ఫార్ములా ఏమయ్యిందీ?''

జవాబుగా హరి, ''హి..హి..హి..'' అని యికిలించాడు.

మధ్యలో గిరి అందుకుని అన్నాడు. ''ఫార్ములా ఏమీ అవలేదులే. అదలానే వుంది. కాకపోతే 'నిష్పత్తి' కొంచెం తారుమారయ్యింది. 70:30 కాస్తా 30:70 అయ్యింది. అంతే కదరా హరీ?''

జవాబుగా హరి మరోసారి ''హి..హి.. హి..'' అని నవ్వాడు.